క్లుప్తంగా

ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



పొన్నూరు: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో యూనియన్ బ్యాంక్ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో యూనియన్ రిన్ సురక్ష ఇన్సూరెన్స్ పాలసీ తీసుకొని ప్రమాదవశాత్తు చనిపోయిన గేరా సుశీల నామినీకు రూ. ఐదు లక్షల చెక్కును బ్రాంచ్ మేనేజర్ పి. ఆదిత్య వర్ధన్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏ.ఏ.హెచ్. కె. కిరణ్ కుమార్, సి.ఎం బి. దిలీప్ కుమార్ శనివారం అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ రూ. 1499 చెల్లించి కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ వారి రిన్ సురక్ష పథకం ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి సిబ్బంది, డ్వాక్రా ఆర్పీలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

కిట్స్‌లో రక్తదాన శిబిరం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే సందర్భంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం, రెయిన్ బో బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో 150 మంది విద్యార్థినీ, విద్యార్థులు రక్తదానం చేశారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.హరిబాబు, కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ప్రాణాన్ని కాపాడే శక్తి రక్తానికి మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శేఖర్‌పాల్గొన్నారు.

ఉల్లాసంగా స్కూల్ గేమ్స్ పోటీలు

ప్రత్తిపాడు: స్కూల్ గేమ్స్ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో మండల స్థాయిలో క్రీడల పోటీలను నిర్వహించారు. అండర్-14, అండర్ -17 విభాగాల్లో విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో సుమారు 300 మంది క్రీడాకారులు హోరాహోరీగా తలబడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలుగా నిలిచిన వారికి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి. డేవిడ్‌రాజ్‌కుమార్ తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు జి ప్రతాప్‌రెడ్డి, నందకుమార్, గంగాధర్, రవికుమార్, వెంకటేశ్వరమ్మలు పోటీలను పర్యవేక్షించారు.

హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించిన ఎంపీడీవో

గుంటూరు రూరల్: జగనన్న లేఅవుట్లలోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకునే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని రూరల్ మండలం ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని ఓబులు నాయుడుపాలెం, పొత్తూరు గ్రామాల్లోగల జగనన్న హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. స్థానిక అధికారులతో అక్కడ జరుగుతున్న పనులు, వసతులను గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ శ్రీనివాసరావు గ్రామ సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



చేబ్రోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినాయక చవితి వేడుకలను మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించాలని చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలులోని ప్రెసిడెన్సీ హైస్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించటంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావటం కోసం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టాఫ్ పారీస్‌తో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, కాలువలు, నదులతో నిమజ్జనం చేయటం ద్వారా నీరు కలుషితం అవుతుందన్నారు. జలచరాలకు హాని కలుగుతుందని ప్రజలకు తెలియజేసి వారిని చైతన్యపరిచారు. డైరక్టర్ వాసిరెడ్డి బన్ బాబు, ప్రిన్సిపాల్ వి.ఆశాలత పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయండి

- పోలింగ్ స్టేషన్ల మార్పు ప్రతిపాదనలపై రాజకీయ పార్టీల నేతలను కోరిన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం. ప్రభాకర్ రెడ్డి
- స్థానికంగా నివాసాలుండని వారి ఓట్లపై ఫిర్యాదులొస్తే తొలగిస్తాం



మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం. ప్రభాకర్ రెడ్డి, పక్కన ఆయా మండలాల తహసీల్దార్లు

ప్రత్తిపాడు: పోలింగ్ స్టేషన్ల మార్పుకు సంబంధించిన ప్రతిపాదనలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ప్రభాకర్ రెడ్డి కోరారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం రాజకీయ పార్టీల నేతల తో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 285 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వాటి లో 87 పోలింగ్ స్టేషన్లుకు పేరు మార్పులు, మరో 25 పోలింగ్ స్టేషన్ల లొకేషన్‌ను మార్పు చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశామని రిటర్నింగ్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రతిపాదనలకు సంబంధించి ఏ మండంలోనైనా అభ్యంతరాలుంటే వారు తమకు గానీ లేదా తహసీల్దార్లకు గానీ లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

పిర్యాదు చేయండి.. తొలగిస్తాం

సమావేశానికి హాజరైన నాయకుల్లో కొందరు ఓటర్ల చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలను ఆర్వో ఎదుట వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండని వారు గ్రామాల్లో చాలా మంది ఉన్నారని, వారంతా బెంగుళూరు, హైదరాబాదుల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారని, అయినప్పటికీ వారికి ఇక్కడ ఓట్లు ఉన్నాయంటూ ప్రభాకర్‌రెడ్డికి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆర్డీవో స్పెషల్ రివిజన్‌లో ఇప్పటి వరకు దాదాపు 21 వేల దరఖాస్తులు వచ్చాయని, ఇంకా ఎక్కడైనా అభ్యంతరాలుంటే తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే విచారించి అర్హత లేకుంటే ఓట్లను తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ నాయకులే కాదని, సాధారణ పౌరులు ఫిర్యాదు చేసినా స్పందించడం జరుగుతుందని చెప్పారు.

పారదర్శకతతో కూడిన ఓటర్ల జాబితా తయారు చేసే విషయాన్ని ఎన్నికల కమిషన్ ఎంతో సీరియస్‌గా తీసుకుందన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సిద్ధార్థ పెదనందిపాడు తహసీల్దారు సుభాని, వెస్ట్ తహసీల్దార్ సాంబశివరావు, వట్టిచెరుకూరు తహసీల్దార్ నాసరయ్య, కాకుమాను తహసీల్దార్ ప్రసాదరావు, ఈస్ట్ డిప్యూటీ తహసీల్దార్ నజీర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో స్మార్ట్ ఐడియా చాలెంజ్ పోటీలు



పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించే స్మార్ట్ ఐడియా హ్యాక్ థాన్ 2023లో పాల్గొనేందుకు తమ కళాశాల విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోగల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐఐసీ కౌన్సిల్, ఐఐపీ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలలో ప్రతిభను చాటేందుకు స్మార్ట్ ఐడియా చాలెంజ్ పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. విద్యార్థులు చూపే ప్రతిభ ద్వారా కేంద్ర ప్రభుత్వ రంగాల్లో సేవలందించినందుకు అంకుర పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహానికి అవకాశాలు లభిస్తాయని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు. ప్రపంచంలో అతి పెద్ద ఓపెన్ ఇన్నోవేషన్ మోడల్‌గా ఎంతో ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచేందుకు అన్ని విధాలా ప్రోత్సాహకం అందించనున్నట్లు కళాశాల ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్ తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్ అందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె కార్తిక్, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఎంవీపి చంద్రశేఖర్, చింతలపూడి శ్రీకాంత్, డాక్టర్ సి.తారాశశాంక్, డాక్టర్ ఈ నాగేశ్వరరావు, డాక్టర్ బి.ఈశ్వర్‌చైతన్య, ఎం. శ్రీనివాస్ తదితరులున్నారు.

సీఎంను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- మార్కెట్‌యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ
- పోలీస్ స్టేషనులో ఫిర్యాదు

ప్రత్తిపాడు: టీడీపీ నాయకులు నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ హెచ్చరించారు. చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ప్రత్తిపాడులో టీడీపీ నేతలు చేస్తున్న నిరసన దీక్ష శిబిరం వద్ద ఆ పార్టీ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారు. అందులో భాగంగానే పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు కాసు పెంటారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో మార్కెట్ యార్డు డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బాపతు వెంకటరమణ శనివారం సాయంత్రం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రిని తీవ్ర పదజాలంతో బూతులు తిట్టారని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఫిర్యాదును ఎస్ఐ డి. రవీంద్రబాబుకు అందజేశారు. స్పందించిన ఎస్ఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నారాయణ్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర్

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి బాధ్యతగా పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు రీజియన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.నారాయణ్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఓజోన్‌డే సందర్భంగా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, కళాశాల ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొరవల్ల పర్యావరణానికి జరుగుతున్న మేలును వివరించారు. సూర్యునినుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు వల్ల కలిగే అనారోగ్యాలు, దాని ప్రాముఖ్యతను వివరించారు. ఓజోన్ పొరను కాపాడుకోవాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ మాట్లాడుతూ భూమి పై ఏర్పడే అనేక రకాల పొల్యూషన్స్ వల్ల ఓజోన్ పొర దెబ్బతినటం జరుగుతుందని దానిద్వారా ప్రకృతి, పర్యావరణం పాడవుతుందన్నారు. ప్రతి ఒక్కరూపర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటాలని వాటిని బాధ్యతగా పరిరక్షించాలన్నారు. కళాశాల యాజమాన్యం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులను ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులున్నారు.

గోమయ వినాయక విగ్రహాల పంపిణీ

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి, గోమయంతో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాలుష్యం బారినుంచి కాపాడుకుందామని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వర రావు తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలో గోమయం, మట్టి, గోరుచిక్కుడు పిండితో తయారు చేసిన 500 వినాయక విగ్రహాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో, గ్రామంలోని ప్రజలకు పంపిణీ చేశారు. రసాయనాలతో, ప్లాస్టరాఫ్‌పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణ కాలుష్యం జరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని కోరారు. ఇదే విధంగా ఆదివారం రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి, గోమయంతో తయారు చేసిన విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షపై ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల నుంచి ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్యాంప్ జరిగే పదిహేను రోజుల ముందు నుంచి గ్రామాల్లో స్క్రీనింగ్ జరుగుతుందని వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ప్రతి గృహాన్ని సందర్శించి ప్రజలకు నిర్ణీత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ మేరియునిస్, ఆశా నోడల్ ఆఫీసర్ నిర్మల పాల్గొన్నారు.

నాక్ ఏర్పాటు విద్యాప్రమాణాల పెంపు కోసమే



శివలింగప్రసాద్‌ను సన్మానిస్తున్న మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: కళాశాలల్లో విద్యాప్రమాణాల పెంపు వాటి ఆవశ్యకతను పెంపొందించి వాటి నాణ్యతకు గుర్తింపు ఇచ్చేందుకు నాక్ ఏర్పాటు చేయబడిందని నాక్ విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ వాసిరెడ్డి శివలింగప్రసాద్ అన్నారు. యూనివర్సిటీ గ్రాండ్ కమీషన్‌చే ఉన్నత విద్యాసంస్థల నాణ్యతస్థితి, ప్రమాణాలకు గుర్తింపు అందించు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) ఆవిర్భావ దినోత్సవంను వీవీఐటీ కళాశాలలో నిర్వహించారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నాక్ విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ వాసిరెడ్డి శివలింగప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో బోధన, పరిశోధనల నాణ్యత పెంపొందించడం నాక్ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అధ్యాపకులు నిత్య విద్యార్థులనీ, పరిశోధనలు, ఆధునిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, డీన్ ఫ్రెష్‌మెన్ డాక్టర్ ఎం.రఘురామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు నిబంధనలు తప్పనిసరి



సీఐ అల్తాఫ్ హుస్సేన్

పొన్నూరు: వినాయక చవితి పండుగ పురస్కరించుకొని పట్టణంలో మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసు వారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పొన్నూరు పట్టణ సీఐ ఎం.డీ. అల్తాఫ్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు వారి నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించి ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠకు పందిళ్ళు, మండపాలు ఏర్పాటు చేసే కమిటీ వారు పోలీస్ స్టేషన్లో తమ వివరాలను తెలియజేయాలన్నారు. కమిటీ గుర్తింపు కార్డు చూపించాలని చెప్పారు. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం తెలియజేస్తే ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల నిబంధనలను పాటించాలని తెలిపారు. మండపాల వద్ద ఇసుక, నీళ్ళను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరుగకుండా ఎలక్ట్రిక్ వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలన్నారు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. రాత్రి సమయాలలో మండపాలలో డబ్బులు, బంగారం లాంటి విలువైన వస్తువులు ఉంచరాదని తెలిపారు.

ఊరేగింపు సమయంలో ఇతర కులా లు, మతాలకు అసౌకర్యం కలిగించరాదని, గులా ములు, రంగులు చల్లడం, డి.జే.లకు అనుమతి లేదన్నారు. నిర్వాహకులు, కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని మండపాల వద్ద ఏమైనా సంఘటనలు జరిగితే వారే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

దాతల సహకారంతో శివాలయం అభివృద్ధి



మాట్లాడుతున్న పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

పెదకాకాని: శివాలయాన్ని దాతల సహకారంతో అన్ని విధాలా తీర్చిదిద్దుతానని ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. పెదకాకాని శివాలయంలో శనివారం పాలకమండలి చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భక్తులకు సౌకర్యాలు, ఏర్పాట్లు, ఆలయ అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పొగాకు కొట్ల వారి స్థలంలో దేవదాయ శాఖ కమిషనర్ అనుమతితో భక్తుల సౌకర్యార్థం గదులు నిర్మాణం చేయడం, దేవస్థానానికి ఉత్తర, పడమర ప్రహరీ నిర్మాణం, నిత్య కల్యాణం, సహస్ర దీపాలంకరణ సేవ నిమిత్తం దిట్టము ఆమోదించుట జరిగింది. అలానే శ్రీ గణపతి నవరాత్రుల ఏర్పాట్లు, శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవముల ఏర్పాట్లు, నిత్యావసర సరుకుల ధరలు ఆమోదం, భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదాన ప్రసాద వితరణ సంఖ్య ప్రతిరోజూ 100 నుంచి 125 మందికి, ఆది, సోమ వారాలలో 200 నుంచి 250 మందికి చేయుటకు తీర్మానం, ఆగస్టు నెల జమా ఖర్చులు ఆమోదిస్తూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని ఏసీ తెలియ జేశారు. ఈ సమావేశంలో పాలక వర్గం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై క్రిమినల్ కేసు

చేబ్రోలు: నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్న రేషన్ డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు శనివారం చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని చౌక డిపో నెంబరు 0734033 డీలరు దానబోయిన శివపార్వతిపై స్థానిక కార్డుదారులు రేషన్ పంపిణీ సక్రమంగా అందించటం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై శనివారం తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, పౌరసరఫరాల శాఖాధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. చౌక డిపో తనిఖీ చేయగా డోర్ నెంబరు 1-101లో ఉండాల్సిన నిత్యావసర సరుకులు అనధికారికంగా కొత్తరెడ్డిపాలెంలోని కొండేటి డొంకలో గల దుకాణంను అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో 61 కింటాళ్ల పీడీఎస్ బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి, నిత్యావసర సరుకుల చట్టం 1955 ప్రకారం 6ఏ కేసు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు రెవెన్యూ, పౌరసరఫరాల శాఖాధికారులు తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రజా పంపిణీ బియ్యంను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయకుండా అవకతవకలకు పాల్పడిన వారిపై సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ తెలిపారు.